నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: జనప్రియా, లోధా, ఐడీపీఎల్, సంజీవయ్య పార్కు సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు మూసాపేట హెచ్‌పీరోడ్డు, లక్ష్మీకళ థియేటర్ ఏరియా, శ్రీరాములు థియేటర్ ఏరియా, అశ్వని హెయిర్ ఆయిల్ లేన్, మధ్యాహ్నం 3 నుంచి 30 గంటల వరకు బేగంపేట పాటిగడ్డ క్వార్టర్స్, నూర్‌బాగ్, భరత్‌నగర్ కాలనీ, మహేశ్వరినగర్ కాలనీ, శక్తినగర్, ఎల్ఐజీ, ఈడబ్ల్యుఎస్, ఎంఐజీ, హెచ్‌ఐజీ క్వార్టర్స్, ఎస్పీనగర్, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సనత్‌నగర్ డీఎస్ఎంకాలనీ, అశోక్‌కాలనీ, సనత్‌నగర్ మెయిన్‌రోడ్డు, సుభాష్‌నగర్, ఎస్ఆర్‌టీ పార్క్, టీవీఎస్ షోరూం లేన్, మెథడిస్ట్ చర్చి లేన్, డీమార్ట్ ఎదురు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలో..రూపాయల్లో..) టమాటా.15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 35, పందిరి బీర 38, క్యాబేజీ 9, క్యారెట్ 19, దొండ 23, గుండుబీన్స్ 75, గింజ చిక్కుడు 45, గోకరకాయ 35, కీర 20, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 85, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 3-4, ముల్లంగి 4-5. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు ఓయూలో ఆవిర్భావ దినోత్సవం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ 108వ ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించనున్నారు. క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభంకానున్న కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, ఎమ్మెల్సీ, ఓయూ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.కోదండరామ్, నగర పోలీస్ కమీషనర్ సీవీ ఆనంద్, నిజాం నవాబ్ మనుమడు నవాబ్ మీర్ నజఫ్ అలీఖాన్ తదితరులు హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు.

ఉంగరం మాయం.. కేసు నమోదు

సనత్‌నగర్: ప్యాంటు జేబులో ఉంచిన 13 గ్రాముల వజ్రపు ఉంగరం మాయమైందంటూ బాధితుడు సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన మేరకు.. బోరబండ న్యూరామారావునగర్‌కు చెందిన జెంట్యాల సుధాకర్ వృత్తిరీత్యా వ్యాపారి. ఈ నెల 15న అర్ధరాత్రి 13 గ్రాములు, 7.5 గ్రాముల రెండు వజ్రపు ఉంగరాలను తన ప్యాంటు జేబులో ఉంచి ఇంట్లో హ్యాంగర్‌కు తగిలించాడు. మరుసటి రోజు 16న ఉదయం తన ప్యాంటును తనిఖీ చేయగా ఉంగరాలు కనిపించలేదు. వాటి కోసం ఇల్లంతా వెతకగా 7.5 గ్రాముల ఉంగరం కనిపించింది. 13 గ్రాముల ఉంగరం దొరకకపోవడంతో తన ఇంటి పని మనుషులపై అనుమానం వ్యక్తంచేస్తూ సుధాకర్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరిట టోకరా

సనత్‌నగర్: ఉద్యోగం పేరుతో నిరుద్యోగికి రూ.44,319 టోకరా వేసిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సనత్‌నగర్‌కు చెందిన సాయితేజ ఈ నెల 24న తన ఫోన్ వాట్సప్‌కు ఉద్యోగ ఆఫర్ పేరిట సందేశం వచ్చింది. దీనికి ఆకర్షితుడైన సాయితేజ వారిని కాంటాక్ట్ చేశాడు. అయితే రిజిస్ట్రేషన్ ఫీజుతో పాటు ఆఫర్ లెటర్‌ను చూపించి మొదటి నెల జీతం 50 శాతం చెల్లించాలని చెప్పారు. దీన్ని నమ్మిన సాయితేజ రూ.44,319లను వారికి చెల్లించి ఆఫర్ లెటర్‌ను అందించాల్సిందిగా అడిగాడు. వేర్వేరు కారణాలతో ఆఫర్ లెటర్ ఇవ్వకుండా దాటవేస్తూ వస్తున్నారు. దీంతో తాను మోసపోయానని గ్రహించి 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు సనత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తల్లీకుమారుడు అదృశ్యం


అంజలి


భార్గవ్

సికింద్రాబాద్: చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో తల్లి,కుమారుడు అదృశ్యమయ్యారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండిలోని సరస్వతి నిలయం అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న అంజలి(48) భార్గవ్(24)లు ఈ నెల 23న సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. డ్యూటీ నుంచి రాత్రికి ఇంటికొచ్చిన అంజలి భర్త నందుకు భార్య, కుమారుడు కనిపించకపోవడంతో ఫోన్ చేశాడు. అయితే స్విచ్ఛాఫ్ వచ్చింది. తెలిసిన వారిని, బంధువులను వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో శుక్రవారం చిలకలగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

టార్గెట్.. సీనియర్ సిటిజన్స్

300 సీసీ కెమెరాలు జల్లెడ పట్టి..స్నాచర్‌ను కనిపెట్టి..

- వయస్సు 32...కేసులు 14..
- కరుడుగట్టిన చైన్‌స్నాచర్ అరెస్టు
- రూ.8 లక్షల విలువైన సొత్తు స్వాధీనం..


విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్..


స్వాధీనం చేసుకున్న సొత్తును చూపిస్తున్న పోలీసులు..

సనత్‌నగర్: వృద్ధాప్య మహిళలే అతని టార్గెట్..అందులోనూ ఒంటరిగా ఉన్న వాళ్లను లక్ష్యంగా చేసుకుంటాడు. ఇందుకోసం తలుపులు తెరిచి ఉన్న ఇంటిని ఎంచుకుంటాడు..వారు నిద్రపోతున్న సమయాన్ని చూసుకుంటాడు..ఇంట్లో వాళ్లు నిద్రపోతే సరే..లేదంటే అద్దెకు ఇల్లు గానీ, షాపు గానీ దొరుకుందేమోనని వచ్చానని చెప్పి మాటల్లో పెట్టి వారి మెడల్లోని బంగారు గొలుసులను లాక్కెళ్లిపోతుంటాడు. ఇదీ ఆ నేరగాడి శైలి. ఒకటి కాదు.. రెండు కాదు.. వివిధ పోలీస్‌స్టేషన్లలో 14 కేసుల్లో నిందితుడు. వయస్సు చూస్తే 32..కేసులు చూస్తే 14..చైన్‌స్నాచింగ్‌ల్లో కరుడుగట్టిన స్నాచర్ తిరుపతికి చెందిన పాపాని క్రాంతికుమార్‌ను బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అతగాడి ఆచూకీ తెలుసుకునేందుకు స్నాచింగ్ జరిగిన ఘటన నుంచి దాదాపు 300 సీసీ కెమెరాలను జల్లెడ పట్టి అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు శుక్రవారం బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాలకృష్ణమూర్తి, ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, డీఐ మధులతో కలిసి నార్త్‌జోన్ డీసీపీ రశ్మీ పెరుమాళ్ వివరాలను వెల్లడించారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ నెల 17న మధ్యాహ్నం ఇంట్లో నిద్రిస్తున్న 75 ఏళ్ల వృద్ధురాలి మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి రెండు తులాల బంగారు గొలుసును తస్కరించుకుపోయాడంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఇది జరిగిన రెండు రోజులకు 19న మారేడ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో అద్దెకు షాపు కావాలంటూ వచ్చి 75 ఏళ్ల వృద్ధురాలి మెడలోని 5 తులాల గొలుసును లాక్కొని పరారయ్యాడంటూ పోలీసులకు ఫిర్యాదు అందింది. అంతకముందు ఈ నెల 16న చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వివేక్‌నగర్‌లో ఇంటి ముందు పార్కు చేసిన హోండా సీబీ షైన్ బైక్‌ను దొంగిలించుకుపోయాడంటూ బాధితుడు ఫిర్యాదు చేశాడు. వరుసగా జరిగిన ఈ ఘటనల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా ఒకే వ్యక్తి బైక్ దొంగతనంతో పాటు స్నాచింగ్‌లకు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో ఆయా కేసుల్లో నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు పలు బృందాలుగా విడిపోయి నిందితుడి ఆచూకీ కోసం గాలింపు ముమ్మరం చేశారు.

300 సీసీ ఫుటేజీలను పరిశీలించి..

పలు బృందాలుగా విడిపోయిన పోలీసులు ఆయా చోట్ల స్నాచింగ్ జరిగిన చోటు నుంచి పోలీసులు సీసీ ఫుటేజీల పరిశీలన మొదలుపెట్టారు. నిందితుడు వెళ్లిన మార్గాల్లో దాదాపు 300 సీసీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ ఫుటేజీలు ఆధారంగా స్నాచింగ్ జరిగిన వారం రోజుల్లోపే నిందితుడు క్రాంతికుమార్‌ను పట్టుకోగలిగారు. నిందితుడి వద్ద నుంచి దొంగిలించబడ్డ బైక్‌తో పాటు 8 లక్షల విలువైన 9.4 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ గోపాలకృష్ణమూర్తి పర్యవేక్షణలో ఈ కేసును చేధించడంలో కీలకంగా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, డీఐ మధులను డీసీపీ అభినందించారు. వీరికి రివార్డులను అందజేయనున్నట్లు ఆమె ప్రకటించారు.

ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం



లాలాగూడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం మైనారిటీ నాయకులు

అడ్డగుట్ట: జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని లాలాగూడకు చెందిన ముస్లీం మైనారిటీ నాయకుడు ఎం.ఏ. హాషమ్ అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం శాంతినగర్ నుంచి లాలాగూడ బడీ మసీదు వరకు జాతీయ జెండాలు పట్టుకొని శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాషమ్ మాట్లాడుతూ ఉగ్రదాడిలో బలైన అమాయకపు ప్రజల ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ శాంతి ర్యాలీలో నాయకులు ఎంఏ. ఫయిమ్‌పర్వేజ్, కోటి, ఆరిఫ్, అక్తర్ తదితరులు పాల్గొన్నారు.

చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ


చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రసూల్‌పురా: వరంగల్ ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరగనున్న టీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని రాష్ట్ర బెవరేజెస్ కార్పొరేషన్ సంస్థ మాజీ చైర్మన్ గజ్జేల నాగేష్ కోరారు. కంటోన్మెంట్ రసూల్‌పురా మార్గదర్శికాలనీ కమ్యూనిటీ హాల్‌లో రెండవ వార్డు ఇంచార్జీ టిఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం, కార్యకర్తల నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన గజ్జేల నాగేష్ మాట్లాడుతూ రజతోత్సవ సభకు కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారులు ధన్‌రాజ్, జంగిలిరాజు, ప్రకాష్, వార్డు అధ్యక్షుడు కుమార్ ముదిరాజ్ ,దేవరాజ్. దేవులపల్లి శ్రీనివాస్, నరసింహ, యాదగిరి, మహేష్, రవి, గణేష్, చంద్రకాంత్, శివ, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్ ఎక్కిన ఆర్టీసీ బస్

లాలాపేట రహదారిలో నిలిచిపోయిన వాహనాలు


లాలాపేటలో కల్వర్టుపై డివైడర్‌ను ఎక్కిన ఆర్టీసీ బస్సు

లాలాపేట: రాణిగంజ్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్(17డి) ఈసీఐఎల్ నుంచి సికింద్రాబాద్ వెళ్తుండగా లాలాపేట ఓపెన్ నాలా కల్వర్టు వద్ద అదుపుతప్పి డివైడర్‌పైకి ఎక్కింది. ఒక్కసారిగా బస్సు ఆగిపోడంతో బస్సుల్లో ఉన్న దాదాపు 25 మంది ప్రయాణికులు ఒక్కసారిగా ముందుకు పడ్డారు. ఇందులో కొందరికి స్వల్ప గాయాలైనాయి. బస్సులోని ప్రయాణికులను వేరే బస్సులో పంపించారు. మౌలాలీ ఫ్లెటెఫ్టర్ నుంచి వేగంగా వస్తున్న ఆర్టీసి బస్సు కల్వర్టుకు ముందు ఉన్న మూలమలుపుతో వేగంగా వెళుతున్న బస్ అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కింది. కాగా ఈ ప్రాంతంలో రాత్రి వేళలలో స్ట్రీట్ లైట్స్ వెలుగడం లేదు. పైగా రోడ్డు మూలమలుపు, కల్వర్టు ఉన్నట్లు ఎలాంటి సూచిక బోర్డులు లేకపోడంతో డ్రైవర్ కన్ఫ్యూజ్ అయినట్లు స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో లాలాపేట రహదారిలో తీవ్ర ట్రాఫిక్ జామ్ అయ్యింది.

బౌద్ధనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ


బౌద్ధనగర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

బౌద్ధనగర్: జమ్మూ కాశ్మీర్‌లో పాకిస్తాన్ ప్రేరేపిస్తున్న ఉగ్రదాడులను భారత్ సమర్ధవంతంగా ఎదుర్కొని తగిన బుద్ధి చెబుతుందని బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు సాయిప్రసాద్ గౌడ్ పేర్కొన్నారు. పహల్గామ్‌లో ఉగ్రదాడిలో మృతి చెందిన వారి ఆత్మలకు శాంతి కలగాలని కోరుతూ శుక్రవారం రాత్రి బీజేపీ నాయకులు బౌద్ధనగర్ నుంచి వారాసిగూడ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడుతూ ఉగ్రదాడికి పాకిస్తాన్ తగిన మూల్యం చెల్లింకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కాశ్మీర్‌లో శాంతి విరిసిల్లి పర్యాటకం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజలు శాంతియుతంగా ఆనందంగా జీవించడం జీర్ణించుకోలేని పాకిస్తాన్ ఈ ఉగ్రదాడులకు ప్రేరేపించిందని విమర్శించారు. పాకిస్తాన్ ఇప్పటికైనా తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందన్నారు. ర్యాలీలో బీజేపీ నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, కనకట్ల హరి, భాస్కర్ గిరి, మద్దెల్ల శ్యామ్, దత్తు, కొమరయ్య, నేతి సత్యానారయణ, అజయ్, చైతన్య, శ్యామ్, సంపత్, సారథి, లడ్డు, ఓములు, భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల వివరాల సేకరణ


సీతాఫల్‌మండిలో ఉద్యమకారుల వివరాలు సేకరిస్తున్న నాయకులు

సికింద్రాబాద్: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు చీమ శ్రీనివాస్ సూచన మేరకు తెలంగాణ ఉద్యమకారుల వివరాలను సేకరిస్తున్నామని ఫోరం ఉపాధ్యక్షుడు మల్లారి అనిల్ తెలిపారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారులను గుర్తించేందుకు 33 జిల్లాల్లోని 654 మండలాల్లో ఈ వివరాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యకారులందరూ ఆయా శిబిరాలలో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, కొండస్వామి, జానకిరెడ్డి, భూసాల్, రామ్ బాబు, జగన్ యాదవ్, శివకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మే డే పోస్టర్‌ను టీయూసీఐ జిల్లా అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ శుక్రవారం ఆవిష్కరించారు.క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ ఎదుట టీయూసీఐ అనుబంధ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మే 1న జరిగే మే డే ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జయ, సావిత్రి, విజయ, పద్మ, శ్యామల, అనిత, కృష్ణవేణి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ గొప్ప తత్వవేత్త


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఓయూ వీసీ ప్రొ కుమార్

లాలాపేట: తార్నాకలోని జాతీయ పోషకాహార సంస్థ(ఐసీఎంఆర్-ఎన్ఐఎన్)లో శుక్రవారం డా. బీఆర్ అంబేద్కర్ 134వ జయంతి, డా. బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌నలర్ ప్రొ కుమార్ మొలుగారం హాజరయ్యారు. రాజకీయ విశ్లేషకులు మల్లేపల్లి లక్ష్మయ్య, ఎన్ఐఎన్ డైరెక్టర్ డా. భారతి కులకర్ణి, ఎన్ఐఎన్ సీనియర్ సైంటిస్టు భానుప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఓయూ వీసీ మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని వర్గాల స్థితిగతులను మార్చే విధానాల రూపకల్పనలతో అంబేడ్కర్ గొప్ప తత్వవేత్తగా నిలిచారని అన్నారు. డా. బాబు జగ్జీవన్ రామ్ దేశ వ్యవసాయ శాఖా మంత్రిగా ఎనలేని సేవలను అందించారని కొనియాడారు. ఎన్ఐఎన్ ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసొసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఉగ్రదాడికి నిరసనగా..

బంజారాహిల్స్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఉగ్రదాడికి నిరసనగా ముస్లింలంతా నల్ల రిబ్బన్లు ధరించి నమాజ్‌లో పాల్గొనాలని హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఇచ్చిన పిలుపు మేరకు బంజారాహిల్స్ రోడ్ నం.10లోని మస్జిద్-ఇ-మదీనాలో ముస్లింలు చేతులకు నల్ల రిబ్బన్లు ధరించి నమాజ్‌లో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో రజతోత్సాహం


ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న బేగంపేట నేతలు

సనత్‌నగర్: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల నేపథ్యంలో ఈ నెల 27న వరంగల్ ఎల్కతుర్తి వేదికగా జరిగే భారీ బహిరంగ సభకు భారీ తరలివెళ్లేందుకు ఆ పార్టీ శ్రేణులు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బీఆర్ఎస్ రజతోత్సవ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుని నేతలు, కార్యకర్తలతో పలుమార్లు సమావేశమై దిశా నిర్దేశం చేశారు. ఆ క్రమంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, ముఖ్యనేతలు తమ తమ డివిజన్లలో సమీక్షా సమావేశాలు నిర్వహించుకుని రజతోత్సవ వేడుకల విజయవంతంపై చర్చించారు. అలాగే పోస్టర్ల ద్వారా తమ ప్రాంతాల్లో కార్యకర్తలతో పాటు అభిమానులకు, ప్రజలకు తెలియజేస్తూ రజతోత్సవ సభ జరిగే వరంగల్ ఎల్కతుర్తికి తరలిరావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఎక్కడికక్కడు ఛలో వరంగల్ పోస్టర్లను అంటించారు. రహదారులను గులాబీమయం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ముందుగా తమ తమ డివిజన్లలో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలను జరుపుకుని ర్యాలీగా తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. బేగంపేటలో కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, సనత్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన బేగంపేట డివిజన్ బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి సూచనలు చేశారు. అలాగే స్థానిక బీఆర్ఎస్ నేతలు శ్రీహరి, సురేష్‌యాదవ్, నరేష్, రఘు, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌ముదిరాజ్, అఖిల్ అహ్మద్ తదితరులు కరపత్రాలు, పోస్టర్ల ద్వారా ఇప్పటికే చలో వరంగలపై విస్తృతంగా ప్రచారం చేశారు.

పాకిస్థాన్ దిష్టిబొమ్మ దహనం


పాకిస్థాన్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వెల్లాల రామ్మోహన్, బీజేపీ శ్రేణులు

సనత్‌నగర్: పహల్గాం సంఘటనకు నిరసనగా ఉగ్రవాద చర్యలకు వ్యతిరేకంగా శుక్రవారం సనత్‌నగర్‌లోని స్వామి సోలిటేర్ అపార్ట్‌మెంట్ కూడలి వద్ద పాకిస్థాన్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరై పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వెల్లాల రామ్మోహన్ మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి పరికిపంద చర్య అన్నారు. దీనికి భారత్ సర్కార్ తగిన బుద్ధి చెబుతుందన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలను తుదముట్టించేందుకు కేంద్ర సర్కార్ గత పదేళ్లుగా ఎంతో కృషి చేస్తూ వస్తుందన్నారు. ఉగ్రవాద చర్యలను ఎవరూ ఉపేక్షించరన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకట సుబ్బారావు, శ్రీనివాస్, రవిచంద్ర, రాజేంద్రాచారి, ఆనంద్, అనురాధ, గౌతమి, సప్నగుప్తా, నాగరాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ మలేరియా డే సందర్భంగా ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న జీహెచ్ఎంసీ, వైద్య సిబ్బంది

బన్సీలాల్‌పేట్: వరల్డ్ మలేరియా డే సందర్భంగా శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో జీహెచ్ఎంసీ మలేరియా విభాగం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. దోమల నివారణ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి వీలుగా బోయిగూడ, బోలక్‌పూర్, ఐడిహెచ్ కాలనీ తదితర ప్రాంతాల్లో దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి గాను సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అంతము ముందు బోయిగూడ పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మలేరియా విభాగం అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ శ్రీనివాస్ రెడ్డి, సూపర్‌వైజర్ రాజేందర్ రెడ్డి, రాజు, బుమేష్, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఏఈ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రధాన శత్రువని, దోమల ద్వారా మలేరియా, డెంగీ, మెదడువాపు, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాప్తిస్తాయన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.



మలేరియాపై అవగాహన ర్యాలీ

అమీర్‌పేట: వరల్డ్ మలేరియా డే సందర్భంగా సర్కిల్-17 ఖైరతాబాద్ ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహనర్యాలీ నిర్వహించారు.అమీర్‌పేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఎస్ఆర్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. మలేరియా బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

చలో వరంగల్ సభను విజయవంతం చేయండి


సభ పోస్టర్‌ను అతికిస్తున్న కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: చలో వరంగల్ బహిరంగ సభను విజయవంతం చేయాలని అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు సంబంధిన పోస్టర్‌ను శుక్రవారం అడ్డగుట్టలోని పలు ప్రాంతాల్లో పార్టీ నేతలతో కలిసి కార్పొరేటర్ అతికించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... తెలంగాణ ప్రజల కోసం పుట్టిన బీఆర్ఎస్ పార్టీ 25ఏళ్ల పండుగకు పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, సత్తయ్య గౌడ్, వసంత, మోహన్,రామస్వామి,నర్సింగ్, దేవయ్య, అల్లా బక్షీ, శ్రీరామ్ నాయక్,శంకర్, రామప్ప, నిఖిల్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల మానవ హారం



ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని కాంట్రాక్టు అధ్యాపకులు మానవ హారం చేపట్టారు. శుక్రవారం క్యాంపస్‌లోని లేడీస్ హాస్టల్ నుంచి రేణుక ఎల్లమ్మ దేవాలయం వరకు అధ్యాపకులు మానవ హారం చేపట్టి ఉద్యోగాలు పర్మనెంట్ చేయాలని నినాదాలు చేశారు. ఇదిలా ఉండగా అధ్యాపకుల నిరవధిక సమ్మె 7వ రోజుకు చేరుకోగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఓయూ పూర్వవిద్యార్థి డా.కాసం వెంకటేశ్వర్లు సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. అనంతరం కాశ్మీర్ ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన పర్యాటకుల ఆత్మశాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. కాంట్రాక్టు అధ్యాపకుల నేతలు ధర్మతేజ, పరుశురామ్, వేల్పుల కుమార్, ఉపేందర్, విజయేందర్ రెడ్డి, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, వినీత పాండే, శైలజరెడ్డి, నసీమా బేగం, పాండయ్య, రవికుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

అడ్డగుట్ట: వ్యభిచార గృహంపై నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకొని లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. లాలాగూడ ఇన్‌స్పెక్టర్ రఘుబాబు తెలిపిన మేరకు.. ఉగాండా దేశానికి చెందిన నయాబేర్ డోరీన్(42) కొంత కాలంగా తార్నాక విజయపురి కాలనీలో వ్యభిచార గృహం నిర్వహిస్తోంది. ఉగాండాకు చెందిన మహిళతోతో వ్యభిచారం చేయిస్తుంది. సమాచారం అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులతో కలిసి వ్యభిచార గృహంపై గురువారం దాడి చేశారు. ఈ క్రమంలో సీతాఫల్‌మండిలో నివాసముంటున్న మాలి దేశానికి చెందిన ఆడమ బాహ(36), ఎల్‌బి నగర్‌కు చెందిన ఎన్. సందీప్(40) అనే కస్టమర్లు, వర్కర్‌తో పాటు నిర్వాహకురాలు డోరీన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 13,500 నగదు, 5 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొని లాలాగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నలుగురిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిర్వాహకురాలు డోరీన్, వర్కర్ హోప్‌లను రిమాండ్‌కు తరలించారు.